ఏరికోరి వృద్ధుణ్ణి పెళ్లాడిన ఆమె అతన్నెందుకు హతమార్చింది?

వై. అచ్యుత రామయ్య కథ

# డబ్బుతో వచ్చిన చావు

"డబ్బు, సెక్సు — ఈ రెండే జీవితంలో ప్రధానమనుకునే వాళ్ళ సంఖ్య రోజురోజుకీ ఎక్కువవుతోంది. ఈ రెండిటి వెంటపడ్డవాళ్ళ జీవితాలు పూర్తిగా అదుపుతప్పిపోతాయి" అని రవి బుక్సు తీసుకుని కాలేజీకి బయల్దేరబోయాడు.

"ఇంతకీ నువ్వనేది ఏమిట్రా?" అన్నాడు రవి తండ్రి రామ్మూర్తి చికాకుగా.


"ఏముందీ, డబ్బు పిచ్చిలోపడి, విమలను ఓ ముసలాడికి కట్టబెట్టి, దాని గొంతు కోయవద్దూ అని. పెళ్ళి ప్రయత్నాలు మాని, చెల్లిని పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయనివ్వండి" అన్నాడు రవి. తన మాటకూడా ఇంట్లోవాళ్ళు వింటున్నందుకు సంతోషిస్తూ

"అవును నాన్నా, నాకింకా చదువుకోవాలని వుంది. నా వయస్సెంతనీ మీరంతగా నా పెళ్ళికోసం తొందరపడుతున్నారు?" అంది విమల.

అంతేగాని — 'రెండోపెళ్ళివాడితో, అదీ జీవిత చరమాంకంలో వున్నవాడితోనాకు పెళ్ళేమిటీ' అని అనడంలేదు విమల. చెల్లెలి ఆలోచనాస్థాయి బాగా ఎరిగినవాడు కాబట్టి రవికి ఇదేమీ విపరీతంగా అనిపించలేదు. విమలకు చిన్నప్పటినుండీ డబ్బు యావ ఎక్కువని అతనికి తెలుసు.

తండ్రి మొహం కోపంతో ఎర్రబడింది — "చూడమ్మా విమలా! మీ అన్నకు పుస్తకజ్ఞానం తప్ప, లోకజ్ఞానం లేదు. వాడిమాటలు విని బంగారంలాంటి నీ భవిష్యత్తును పాడుచేసుకోకు"

విషయం మొదటికొచ్చేసరికి లాభం



లేదనుకుని రవి బయటకు పోయాడు. దాంతో విమలకు బ్రెయిన్‌వాష్ చేసే కార్యక్రమం మొదలయింది.

వీధి తలుపులు వేసివచ్చి రామ్మూర్తి విమల ప్రక్కనే కూర్చున్నాడు ''చూడుతల్లీ! తల్లిదండ్రులెక్కడైనా పిల్లలు సుఖపడాలనే కోరుకుంటారుగాని, వాళ్ళ బ్రతుకులు నాశనం చేయాలనుకోరుకదా! సుందరయ్య

.ారి వయస్సు అర్థవైకి దగ్గరగా వుండచ్చుగా నీ, ఇంతవరకూ ఒక్క పన్నుకూడా ఊడలేదు. మొన్నీమధ్యనే భార్య పోయింది. తలకి కొరివి పెట్టేవాడుకూడా లేకుండా దిక్కుమాలిన చావు చావడం ఆయనకు అస్సలు ఇష్టం లేదు. అందుకే మరో పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారాయన.

"ఆయనిప్పుడు పెళ్ళి చేసుకోబుతున్నారని తెలిస్తే, వారి ఆస్తిపాస్తులను గురించి విన్న ఆడపిల్లలు అనేకమంది వచ్చి క్యూలో నిలబడతారు. మన అదృష్టం బావుండి, ఆయన కంటికి నీవు వచ్చావు. ఆ మధ్యనెప్పుడో ఆయన నిన్ను శివాలయంలో చూశారట. అవకాశం అన్నది ఎప్పుడోగాని రాదు. వచ్చినప్పుడు దాన్ని వడుపుగా అందుకోగలిగినవాళ్ళే జీవితంలో పైపైకి పోగలుగుతారు"

తండ్రి ఉపన్యాసం అయిన వెంటనే తల్లి అందుకుంది "ఈ సంబంధం చేసుకున్నావో నీ వళ్ళంతా బంగారంతో మిలమిల మెరిసిపోతుంది. ఆయనెప్పుడూ వ్యాపారమంటూ ఊళ్ళమీదే తిరుగుతూ వుంటారట. ఆ సమయంలో నీ మనసుకువచ్చిన కుర్రాడెవరితోనైనా సంబంధం పెట్టుకున్నా లంకంత కొంపలో ఎవరికీ ఏమీ తెలియదు"

విమలకు కాళ్ళక్రింద నేల అదిరినట్లయింది. అందరికీ నీతులు చెప్పే తన తల్లి డబ్బుకోసం ఓ ముసిలాణ్ణి పెళ్ళిచేసుకోమనీ, కోరికలు తీర్చుకోవడానికి మరో కుర్రాడితో కులకమనీ సలహా ఇస్తోంది! డబ్బుముందు నీతులు ఎలా నీరుగారిపోతాయో విమలకు అప్పుడే అర్థమయింది.

* * *

ఆలోచిస్తే తల్లిదండ్రులు చెప్పినదాంట్లో కూడా నిజం లేకపోలేదనిపిస్తోంది విమలకు. తమ ఆర్థిక పరిస్థితికి, గంతకుతగ్గ బొంత అన్నట్లు, ఏ బ్రతకలేని బడిపంతులో, అర్థాకలి గుమస్తానో భర్తగా దొరుకుతాడు. డబ్బు కొరతవల్ల మధ్యతరగతి సంసారాలు ఎంత నిస్సారంగా తయారవుతున్నాయో గ్రహించలేనంత అమాయకురాలేంకాదు తను.

తనలో ఎంతో సృజనాత్మకమైన ఆలోచనలు వున్నా, డబ్బు లేకపోవడంవల్ల, నత్తలా ఈ కొంపలోనే చుట్టచుట్టుకుని పడి వుండాల్సి వస్తోంది. డబ్బు వుండాలేగానీ, ప్రపంచంలోని సర్వసుఖాలు తనవికావూ! ఈ ఆలోచన రాగానే అప్పుడే రెక్కలు తొడిగిన సీతాకోకచిలకలా ఆమె మనసు ఎక్కడికో ఎగిరిపోతోంది.

"నాన్నా, నేను మనస్ఫూర్తిగా ఈ పెళ్ళికి ఒప్పుకుంటున్నాను" అని బయటికే చెప్పిందో, లేక మనసులోనే అనుకుందో ఆమెకే తెలియని పరిస్థితిలో వుంది విమల.

* * *

సుందరయ్య ఎంతో ఆస్తిపరుడయినా, వయసు మీదపడ్డాక చేసుకుంటున్న రెండో పెళ్ళి కాబట్టి, ఎంతో నిరాడంబరంగా పెళ్ళి జరిపించుకున్నాడు.

విమల రాకతో ఆస్తిలో అంతో ఇంతో దక్కుతుందన్న ఆశకాస్తా పోవడంవల్ల, అంత వరకూ ఆ ఇంట్లో వుండి, ఆయనకు వండి పెడుతున్న బంధువులు ఒక్కొక్కరూ నెమ్మదిగా జారుకున్నారు. నెలజీతం తప్ప మరో ఆశలేని పనిమనిషి వరాలు ఒక్కతే మిగిలింది ఆ ఇంట్లో.

పెళ్ళయి వారం రోజులు తిరక్కుండానే చాలా తొందరపాటు నిర్ణయం తీసుకుని ఈ పెళ్ళికి ఒప్పుకున్నానే అన్న దిగులు పట్టుకుంది విమలకు. సాయంకాలం అయ్యేసరికి మేడమీదకెళ్ళి రోడ్డుమీద పోయే జనాలను చూడడమొక్కటే ఆమెకున్న కాలక్షేపం. 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లా వుండే జంటలను చూస్తుంటే ఆమెకు ఎంతో దుఃఖం కలుగుతోంది. తండ్రి వయసున్న ఆయనతో కాపురం ఎలా చేసేది? తన యౌవనమంతా అడవికాచిన వెన్నెల కావలసిందేనా?


ఇనప్పెట్టె తెరచి, వంటినిండా బంగారు వస్తువులను తగిలించుకుంది విమల. గోడమీద తగిలించిన ఫోటోనుండి లక్ష్మీదేవి బయటకు వడచివచ్చినట్లుందామె.

వెనుకనున్న వసారాలో సుందరయ్య పనివాళ్ళను కసురుతున్నాడు తొందరగా వెన్నను ప్యాకింగ్ చేయమని. ఇంతలో విమల వచ్చి సుందరయ్య ప్రక్కనే నిలబడి చూస్తోంది. బాగా పండిన అరటిపళ్ళ గుజ్జును వెన్న మధ్యలో పెట్టి ప్యాక్ చేస్తున్నారు వాళ్ళు. నేతి వ్యాపారంలో సుందరయ్య అంతగా ఎదిగిపోవడానికి కారణం ఏమిటో విమలకు అప్పుడే తెలిసింది.

ఇంతగా 'కష్టపడి' సంపాదించిన డబ్బును తదనంతరం రాబందుల్లాంటి బంధువులకెవరికో ధారపోయడం సుందరయ్యకు సుతరామూ ఇష్టంలేదు. మరణానంతరం మరో లోకం వుంటుదన్న గ్యారంటీ వుంటేనూ, ఇక్కడ సంపాదించిన డబ్బును ఆ లోకానికి తీసుకుపోయే మార్గమేదైనా వుంటేనూ, ఆయన మళ్ళీ పెళ్ళిచేసుకుని, పిల్లలను కనాలని అనుకునేవాడు కాదు. అంటువంటిదేమీ లేదుకాబట్టే తన కష్టార్జితాన్ని తన రక్తం పంచుకుని పుట్టిన బిడ్డలే అనుభవించాలి. అందుకే నలుగురూ ఏమనుకుంటున్నా, ఈ వయసులోకూడా పెళ్ళిచేసుకుని, పిల్లల కోసమీ ప్రయత్నాలు.

* * *

వ్యాపారం పనులమీద సుందరయ్య ఎక్కువసమయం పొరుగు ఊర్లలోనే గడుపు



తున్నాడు. ఈ సమయంలో విమల డబ్బు యొక్క విశ్వరూపాన్ని దర్శిస్తోంది. బంగారం, బట్టలూ, ఫర్నిచరూ — ఒకటేమిటి తనకు కావలసినవల్లా కొనుక్కోవడం తప్ప, అడ్డుచెప్పేవారులేరు.

అయినా విమలకు జీవితంలో ఏదో వెలితి కనిపిస్తోంది. తల్లిదండ్రులు తనని తప్పుదారి పట్టించేరు... ఎవరినో అనుకుని ఏం లాభంలే! తన బుద్ధి ఏమయిందప్పుడు? అన్నయ్య చెప్పిన మాటలేమో రుచించలేదు

తన డబ్బు కాంక్షే తనకిన్ని కష్టాలు తెచ్చిపెట్టింది. తన బ్రతుకెలా వుందో తెలుసుకోవాలన్న ధ్యాసే లేదు తల్లిదండ్రులకు. నాన్న అప్పుడప్పుడూ వచ్చి తన దగ్గరుండి కొంత డబ్బు గుంజుకు పోవడంతప్ప. ఇతరులు తనకు ప్రేమను అందించలేదని బాధపడేబదులు, తనే ప్రేమను వెదుక్కోవాలి. ఎలా?

మొదట — కోటలా ఎంతో అందంగా కనిపించిన ఆ పెద్ద ఇల్లు, ఇప్పుడు తన పాలిట జైలులా అనిపిస్తోంది. తనకిప్పుడు స్వేచ్ఛ కావాలి. స్వేచ్ఛాప్రణయం కావాలి.

ఇది గమనించిన పనిమనిషి వరాలు ఓ సలహా ఇచ్చింది. "అమ్మా తవరు ఏమాత్రం బయటకెళ్ళినా ఆ విషయం అయ్యగారికి ట్టే తెలిసిపోద్ది. సేనా జాగత్తగా వుండాల. సీనువాసుగారనీ ఓ కుర్రడాట్టరు వున్నారమ్మా. ఒంట్లో బావుండలేదనిసెప్పి తవరు అప్పుడప్పుడూ ఆయన దగ్గరకెడుతూ వుంటే, మీక్కొంత కాలక్షేపం అవుతుంది"

'చదువుకోనిదయినా వరాలు గట్టిముండే' అనుకుంది విమల.

* * *

డాక్టరును చూడకుండా వుండలేకపోవడమే పెద్ద జబ్బు అయిపోయింది విమలకు. ఆ రకంగా బయటి ప్రపంచానికి ద్వారాలు తెరచినట్లయింది.

డాక్టర్ శ్రీనివాస్ ఇటువంటి 'రోగాల'ను కుదర్చడంలోకూడా సిద్ధహస్తుడే. ఆయన దగ్గరకు వచ్చే పేషంట్లలో ఇటువంటివాళ్ళే ఎక్కువ.

తప్పు చేస్తున్నానన్న అపరాధభావం విమలను వెంటాడుతున్నా, దాన్ని అధిగమించే అనేకరకాల ఇతర ప్రేరణలు కళ్ళకు గంతలుకట్టి ఆమెను నడిపిస్తున్నాయి.

పేషంట్లూ, ఆపరేషన్లతోబాటుగా విమలతో సంబంధాన్నికూడా తన వ్యాపారంలో భాగంగా చేసేసుకున్నాడు డాక్టరు. ఆమెపై ఏమాత్రం అభిమానం చూపించకుండా, అధికారం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నాడతడు.

కొద్దిరోజులకే విమలకు ఈ సంబంధంలో ఎంతో అసంతృప్తి ఎదురయింది. ప్రేమించే హృదయంకోసం పరితపించిపోతుందామె మనస్సు. ఈ విషయాన్ని ఎంతో తెలివిగా పసికట్టినవాడు సురేష్ అన్న యువకుడు. ఇతను డాక్టరుగారి ఆశీస్సులతో హాస్పిటల్‌ను ఆనుకొనే ఓ మెడికల్‌షాపు పెట్టుకున్నాడు. లాభాల పంపకంలో కుదిరిన ఒప్పందం ప్రకారం తన దగ్గరకు వచ్చే పేషంట్లందరికీ సురేష్ షాపులో మాత్రమే దొరికే మందులను రాస్తున్నాడు డాక్టరు.

అతి త్వరలో అత్యధికంగా డబ్బు సంపాదించడానికి అడ్డదారులు వెతుకుతున్న సురేష్‌కు బంగారుగుడ్లుపెట్టే బాతులాంటి

విమల కనిపించింది.

వెమ్మదిగా సురేష్ విమలతో పరిచయం పెంచుకున్నాడు. ఇద్దరూ సమవయస్కులు కావడంవల్లా, ఒకరికి కావలసింది మరొకరిలో వుండడంవల్లా అతి తక్కువ టైములోనే ఎంతో దగ్గరయ్యారు.

సురేష్ ఆమెపై ఎంతో ప్రేమను నటించాడు. ఆమెకోసం ఏమైనా చివరకు తన బిజినెస్సూ, భార్యాబిడ్డలను సహితం త్యాగం చేయడానికి సిద్ధమేనన్నాడు. వెతకబోయిన తీగ కాలికి తగిలినట్లనిపించింది విమలకు.

తన దయాధర్మాలమీద పైకొచ్చిన సురేష్, తన నోటిదగ్గర కూడును తన్నుకుపోవడాన్ని డాక్టర్ సహించలేకపోతున్నాడు. సురేష్‌ని ఎలా దెబ్బకొట్టాలా అని సమయంకోసం ఎదురు చూస్తున్నాడు.

* * *

సరాసరి ఇంటికి వచ్చేసిన సురేష్‌ను చూసి విమల ఆశ్చర్యపోయింది.

"ముసిలాడు ఎక్కడికి చచ్చాడూ?" అంటూ సురేష్ సోఫాలో కూర్చున్నాడు.

"వైజాగ్ వెళ్ళి వారం రోజులయింది"

"బందిఖానా తప్పనపుడు పంజరం బంగారంతో చేసిందయినా, ఇనపదయినా ఒక్కటే"

సురేష్ మాటల వెనక అర్థం గ్రహించిన విమల "ఏం చేయను? బయటపడే మార్గం ఏమీ కనిపించడంలేదు" అంది.

"ఎంతకాలం ఇలా చాటుమాటు వ్యవహారం నడపగలం? మనిద్దరికోసం సిటీలో మంచి ఇల్లు ఒకటి చూసి వుంచాను. ముసిలాడు వచ్చేలోగా డబ్బూ, బంగారం సర్దుకుని రెడీగా వుండు. ఈ చిన్న ప్యాకెట్టు జాగ్రత్తగా దగ్గర పెట్టుకో. ముసిలాడు వచ్చినవెంటనే పాలల్లో ఈ పొడుం కలిపి ఇచ్చేసెయ్యి. పీడా విరగడయిపోతుంది" అన్నాడు.

ఇంత ఐశ్వర్యం ఇచ్చిన భర్తను చంపడమన్న ఆలోచన విమలకు ఎంతో బాధను



## కలిసే...

శాంతతో అన్నాడు రాంబాబు –

"ప్రతి క్షణం నీతో కలిసి వుండాలనిపిస్తోంది డియర్! నిన్ను విడిచి వుండలేను..."

"నాక్కూడా అలాగే అనిపిస్తోంది డియర్! నీ బ్యాంక్ అకౌంట్ విషయంలో కూడా ఇద్దరం కలిసేవుందాం!" తక్కున అంది శాంత.

—కె.వెంకటేశ్వర్ (కరీంనగర్)

కలిగించింది. కానీ, ఈ జైలునుండి బయట పడడానికి వేరే మార్గమేమీ కనిపించడం లేదామెకు.తన స్వేచ్ఛాపోరాటంలో భర్త మొదటి పావు.

అనుభవించాల్సిన వయసులో, అనుక్షణం భయంతో తన సుఖాలను త్యాగం చేయలేదు

''సురేషు! విషంవల్ల చనిపోయినట్లు పోస్టుమార్టంలో తెలిసిపోతుందేమో?'' అంది విమల.

''ఏం భయంలేదు. అటువంటిదేమీ జరగకుండా నేను ఏర్పాటు చేస్తానుకదా!''

* * *

సుందరయ్య చనిపోయాడని తెలియగానే ఆయన బంధువులందరికీ భయం పట్టుకుంది. ఆస్తికోసం తామెక్కడ ఆయన్ని చంపామని కేసు వస్తుందోనని. అందుకే అంతిమ సంస్కారానికి ఏర్పాట్లు అతి తొందరగా జరిగిపోయాయి.

రకరకాల ఆలోచనలతో విమల బుర్ర వేడెక్కిపోయింది. చిన్న తప్పునుండి పెద్ద తప్పుకూ అక్కడినుండి మరింత పెద్దతప్పుకూ మజిలీలా వుందామె జీవితం. ఈ జీవన స్రవంతిలో తను ఏ దరికి చేరనుందో? ఏదీ తన చేతిలో లేదు. వ్యభిచరించడం దగ్గరనుండి హత్యలు చేసేవరకూ వచ్చింది తను. ఇంకెన్ని ఘోరాలు చేయనుందో!

తనకు మంచిగా బ్రతకాలనే వుంది. కానీ ఈ ఊబినుండి బయటపడలేకపోతోంది. తన పరిస్థితి చూసి తనకే జాలిగా వుంది.

ఈ దుర్భరమైన జీవితాన్ని తను ఇంకెంతమాత్రమూ కొనసాగించలేదు. ఆత్మహత్యతో ఈ సమస్యలన్నింటికీ అంతిమగీతం పాడితే?

ఏమిటీ, తనీరోజు ఇంత పిరికిగా ఆలోచిస్తోంది? ఆత్మహత్య చేసుకుంటే అందరూ తనని చూసి జాలిపడతారు. తానది సహించలేదు. 'ఆమె చేసిన పాపాలే, ఆమెకీగతి పట్టించాయి' అని పెదవి విరుస్తారు. వాళ్ళకా అవకాశం ఇవ్వకూడదు. జీవితంలో తనింత రిస్కు తీసుకున్నది — అర్ధాంతరంగా చావు కొని తెచ్చుకోవడానికి కాదుకదా! తనే ఈ బ్రతుకుయొక్క అంతం చూడాలి.

తనకంటూ ఓ స్వంత జీవితం వుండాలన్న ఆలోచన వచ్చిందామెకు. సిటీలో తమ కోసమని సురేష్ చూసిన ఇంట్లో వుండడానికి నిర్ణయించుకుంది.

కొత్త ఇంట్లోకి వెళ్ళిన కొద్దిరోజులకే విమలకు తెలిసిపోయింది — జీవితం తను ఊహించుకున్నట్లుగా కాకుండా ఎంతో వికృతంగా తయారైందని. స్వంత ఇల్లన్నమాటేగాని, సురేష్ అర్ధరాత్రి సమయంలో మెల్లగా దొంగలా వచ్చిపోతున్నాడు. డబ్బు, బంగారం విపరీతంగా తీసుకుని పోతున్నాడు. విమలకు భయం వేసింది. కూర్చుని తింటే కొండలే కరిగిపోతాయంటారు.

''ఇంత డబ్బు, బంగారం తీసుకునిపోయి ఏం చేస్తున్నావు?'' అని సురేష్‌ను నిలేసింది.

''నీకోసం నేను బయటపడుతున్న బాధలు నీకేం తెలుసు? నీకవన్నీ చెబితే భయపడతావని ఇంతవరకూ చెప్పలేదు. ఆస్తిలో నీకు చిల్లిగవ్వకూడా దక్కనీయకూడదని మసలాడి బంధువులు ఎంతో ప్రయత్ని

స్తున్నారు. మనిద్దరి మధ్యనున్న సంబంధాన్ని ఏదో లిటిగేషన్‌తో చెడగొట్టాలని అనేకమంది ప్రయత్నిస్తున్నారు. కోర్టులచుట్టూ, పోలీసులచుట్టూ తిరిగేసరికి నా తల(ప్రాణం తోకకి వస్తోంది. వీటన్నిటికీ అయ్యే ఖర్చులు ఎక్కడినుండి తీసుకురమ్మంటావ్?'' అని అరిచాడు సురేష్.

రోటిలో తలపెట్టి రోకటిపోటుకు బాధ పడడం దేనికన్నట్లు విమల మాట్లాడకుండా ఊరుకుంది.

* * *

నెలరోజుల తరువాత కనిపించిన భర్త సురేష్‌ను చూడగానే వరలక్ష్మికి ఎంతో బాధకలిగింది — ''ఆ మొగుడుచచ్చిన ముండను మీ ఆయన వుంచుకున్నాడటకదా !'' అని అందరూ అంటుంటే తల ఎత్తుకు తిరగలేకపోతున్నానండీ'' అంటూ ఏడ్చింది.

ఆ మాటలను ఏమాత్రం ఖాతరు చేయకుండా సురేషు గట్టిగా నవ్వి ''పిచ్చిదానా, ఎవరో ఏదో అనుకుంటారని, వచ్చిన అవకాశాన్ని వదులుకుంటామా? నేనేంపని చేసినా నీకోసం, పిల్లలకోసమే. మొన్న తీసుకువచ్చిన నెక్లెసు ఎక్కడిదనుకుంటున్నావ్? అది విమలదే. మరో రెండుమూడు రోజుల్లో నీకు వడ్డాణం తీసుకొద్దామనుకుంటున్నాను. విమల దగ్గర డబ్బూ, బంగారం పూర్తిగా గుంజేశాక, దాన్ని పరలోకానికి పంపేసి, ఆ తర్వాత అంత నీ దగ్గరే వుండిపోతాను'' అన్నాడు.

వరలక్ష్మి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. ''నా తొందరపాటుకు మన్నించండి. మీ మనస్సును సరిగా అర్థంచేసుకోలేకపోయాను. ఇకనుండి మీకు ఎప్పుడూ ఎదురు చెప్పను.. వడ్డాణంతోపాటుగా, దండకడియాలుకూడా పెట్టుకోవాలని ఎప్పటినుండో కోరికగా వుందండీ...''

* * *

ఎన్నోరోజుల తరువాత ఇంటికొచ్చిన



వాజ్‌పాయిగారికే

# హిందీపిచ్చి

ఉత్తర భారతదేశంలో ములాయంసింగ్ యాదవ్‌కున్నట్లే... బిజేపీకి కూడా హిందీ అంటే తెగమక్కువ! ఐక్యరాజ్యసమితిలో మొదటిసారి హిందీ మాట్లాడిన ఘనత కూడా ఆ పార్టీకి వెందిన వాజ్‌పాయిగారికే దక్కుతుంది. అయితే దక్షిణ భారతదేశం వచ్చేసరికి వీళ్ళంతా ఓట్లకోసం ప్లేటు ఫిరాయించేస్తారు! ఈ మధ్య కర్నాటక పర్యటనలో అద్వానీ ''హిందీ మీమీద రుద్దం'' అంటూ వాగ్దానాలుకూడా చేశారట! దక్షిణాదిలో అద్వానీగారు ఇంగ్లీషులో మాత్రమే మాట్లాడుతున్నారట — మరి ఓట్లు ఊరికే వస్తాయా?

—జూపిటర్

భర్తను చూసి వరలక్ష్మి ''ఏమిటండీ, మీరీమధ్య మరీ చిక్కిపోతున్నారు. మొహంలో ఏమాత్రం జీవకళ లేదు. అప్పటి ఉత్సాహం అస్సలు లేదు'' అంది.

బూట్లుకూడా విప్పుకోకుండా నీరసంగా మంచంమీద పడుకుని సురేష్ ''నాకీమధ్య అస్సలు మనశ్శాంతి లేదు వరం. విమలను వాళ్ళకు దూరం చేశానన్న కక్షతో నన్ను చంపాలని ఒకప్రక్క డాక్టర్ శ్రీనివాసూ, మరోప్రక్క విమలతండ్రీ విపరీతంగా ప్రయత్నాలు చేస్తున్నారు... అమ్మా కడుపునొప్పి'' అంటూ మెలికలు తిరిగిపోతున్నాడు. వెంటనే పెద్దవాంతి చేసుకున్నాడు.

అతని నుదుటిమీద చెయ్యివేసి చూసిన వరలక్ష్మికి — అతనెంతో జ్వరంతో బాధపడుతున్నాడని గ్రహించింది. ఆమె మనస్సు ఏదో కీడు శంకిస్తోంది. పిల్లలను ప్రక్కింటి వాళ్ళకు అప్పజెప్పి, ఆటోలో భర్తను తీసుకుని సిటీలోని హాస్పిటల్‌కు బయలుదేరింది.

* * *

సురేషు చనిపోయాడన్న వార్త వినగానే మొదలు నరికిన చెట్టులా నేలకు వ్రాలిపోయింది విమల. ఎంతకీ ఆమెకు స్పృహరాకపోయేసరికి పనిమనిషి వరాలు డాక్టర్ శ్రీనివాస్‌ను పిలుచుకొచ్చింది. ప్రక్క ఊరిలో వున్న విమల తల్లిని తీసుకురావడానికి వరాలు తన భర్తను పంపించింది.

డాక్టరు వైద్యం ప్రారంభించిన కొన్ని గంటల తరువాత విమలకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూసేసరికి ఆమె మంచానికి ఒకప్రక్క తల్లీ, మరోప్రక్క డాక్టరూ, కాళ్ళవైపు వరాలూ వున్నారు. తనకి ఏమయిందో, తనెక్కడ వుందో విమలకు అర్థం కాలేదు కొంతసేపటివరకూ

కాచి చల్లార్చిన నీళ్ళలో ఈ పొడుం కలిపి ఇవ్వండని డాక్టర్ ఎలక్ట్రాల్ ప్యాకెట్టు విమల తల్లికి ఇచ్చాడు. వేడినీళ్ళు పెట్టడానికని తల్లీ, పనిమనిషి వంటింట్లోకి వెళ్ళారు.

ఆ సమయంలో డాక్టరు అంటున్న మాటలకు విమలకు మరోసారి స్పృహతప్పుతున్నట్లు అనిపించింది.

''విమలా! మనిద్దరి మధ్యనుండి సురేష్‌ను తొలగించింది నేనే. 'అపెండిసైటిస్' నొప్పితో సిటీలోని ఓ పెద్ద హాస్పిటల్‌లో సురేష్ జాయిన్ అయ్యాడని నాకు తెలిసిన వెంటనే అతనికి ఆపరేషన్ చేసే డాక్టరుతో ఫోనులో మాట్లాడి, కావాలనే అతని ఆపరేషన్ ఫెయిల్ అయ్యేట్లు చేయించాను. నా దారికి అడ్డువచ్చినవారినెవరినీ నేను క్షమించలేను. మరింకెప్పుడూ నానుండి తప్పించుకోవాలని ప్రయత్నించకు'' అని బయటికెళ్ళిపోయాడు.

ఏ క్షణాన్నయినా తనకి పిచ్చి ఎక్కవచ్చనిపించింది విమలకు. తన బ్రతుకెందుకిలా బజారున పడిపోయింది? తన జీవితం ఇంతగా పతనం కావడానికి కారణం — తన డబ్బుమోజూ, తప్పుడు నిర్ణయాలు మాత్రమేకాదు, తన చుట్టూతా వున్న సంఘం మాదచ్చోదీయే.

తల్లిని చూడగానే విమల దుఃఖాన్ని ఆపుకోలేక, ఆమెను పట్టుకుని ఏడ్చేసింది. తల్లికూడా కళ్ళనీళ్ళు పెట్టుకుని ''ఎన్ని బాధలొచ్చినయి తల్లీ నీకు. మన ఇంటికి

పోదాంరా. నిన్ను నా కడుపులో పెట్టుకుని కాపాడుకుంటాను'' అంది.

విమల చూపులు ఎక్కడో శూన్యంలో చిక్కుకున్నట్టున్నాయి. ''అమ్మా! ఆ రోజున అన్నయ్య చెప్పిందే కరెక్టు. నా జీవితం పూర్తిగా అదుపుతప్పిపోయింది. నన్నెవ్వరూ రక్షించలేరు ఇప్పుడు. సహస్ర శిరశ్ఛేద అపూర్వ చింతామణిలాంటిదీ డబ్బు. ఇంకెంతమంది తలలు తెగనున్నాయో!''

*

